
# తృష్ణ

ఎస్. జ్యోతినాథ్



త్రప్రొద్దున అరుణరేఖలు ప్రసరించకుండానే లేచి, వీధివాకిలి శుభ్రంచేసి, ముగ్గులు తీర్చిదిద్దడం లక్ష్మికి అలవాటు. ఆవేళ కూడా ఆ అలవాటు ప్రకారమే, శీతాకాలపు చలి శరీరాన్ని వణికిస్తుంటే, తల మీదుగా, ఒంటినిండా పైటకప్పుకుని వాకిట్లో కొచ్చింది లక్ష్మి. ఊరుకింకా బద్ధకం తీరలేదు. ప్రశాంతంగా వున్నాయి పరిసరాలన్నీ.

పని మొదలెట్టబోయిన లక్ష్మి అప్రయత్నంగా ఆగిపోయింది. అతి సూక్ష్మంగా పనిచేసే ఆమె చెవులకి, అతి మంద్ర స్థాయిలో తంబూరా శృతి చేస్తున్న ధ్వని విన్పించింది. కాస్త ప్రయత్నం మీద ఆ ధ్వని ఎదురింట్లోనుండి వస్తోందని అర్థం చేసుకుంది. రెండడుగులు అటుకేసి పడ్డాయి.

ఆ పాడేదెవరోగాని, ఆయన కంఠం చాలా గంభీరంగా, మధురంగా వుంది. ఆ వాతావరణాని కనువైన 'భూపాలరాగాన్ని' కమనీయంగా ఆలపిస్తున్నారాయన. లక్ష్మి వచ్చినపని మర్చిపోయింది. తన్మయత్వంగా వింటూ నిల్చుండిపోయింది. శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణిః అన్న పెద్దలు ఆ వాక్యంలో లక్ష్మిని కూడా చేర్చుకోవచ్చు. పాటంటే అంత యిష్టం లక్ష్మికి. ఊహూఁ....సంగీతం లక్ష్మి ప్రాణం అంటే సరిపోతుందేమో! "లక్ష్మీ" వెనుకనుండి అత్తగారి పిలుపుకులిక్కిపడింది, లక్ష్మి. అప్పటికి తెల్లగా తెల్లవారిపోయింది. ఒక చేత్తో చీపురూ, మరో చేత్తో ముగ్గుడబ్బా పట్టుకుని తనింకా అలాగే నిల్చుంది. వీధిలో వెళ్తోన్న ఒకరిద్దరు మనుష్యులు తనకేసి విచిత్రంగా చూసుకుంటూపోవడం గమనించి, అమితంగా సిగ్గుపడిపోయింది లక్ష్మి.

"ఈపాటికి వేరే పనులు చక్కబెట్టుందేదానివి. ఏమిటలా నిల్చుండిపోయావ్?" అడిగింది సీతమ్మ. లక్ష్మి సమాధానం చెప్పేలోపల, అప్పుడే పేస్ట్ బ్రష్‌తో వాకిట్లోకొచ్చిన మోహన్ నవ్వుతూ అనేశాడు. "ఏముందీ....నీ కోడలి చెవులేసంగీతాన్నో పసిగట్టివుంటాయి....పాపం...దాన్ని వృధా పోనివ్వడమెందుకని....అవునా లక్ష్మీ"

లక్ష్మి ముద్దుగా మూతి ముడుచుకుని, గబగబా పనిలోపడింది.

"ఏమిటో......ఎవరిపిచ్చి వాళ్ళకానందం..... అయినా పని మానేటంత పారవశ్యమేమిటో?" చిన్నగా గొణుక్కుంటూ లోపలికెళ్ళిపోయింది సీతమ్మ. లక్ష్మి ముఖం చిన్నబోవడం గమనించాడు మోహన్. ఆమె దగ్గరగా వస్తూ, "అమ్మ మాట పట్టించుకోకు లక్ష్మీ....మాష్టారుగారు బాగా పాడుతున్నారుగదూ! నేనూ విన్నాను" అన్నాడు. "ఇంకేం? నీ పంటపండింది. రోజూ కావల్సినంత సంగీతం...." నవ్వాడు.

విసురుగా జడ వెనక్కి వేసుకుంటూ, "వేళాకోళమా?" అంది లక్ష్మికినుకగా.

"ఛ....ఈ విషయంలో వేళాకోళమేమిటి? సంగీతంపట్ల నీ అభిరుచి నాకు తెలీందా లక్ష్మీ?"

లక్ష్మి ముఖం విప్పారింది.

"అయ్యగారు త్వరగా వేంచేస్తే కాఫీ కలిపి యిస్తాను." అంటూ, మురిపెంగా అతనికేసి చూసి లోపలికెళ్ళిపోయింది. భావయుక్తంగా ఆ ఎదురింటి వ్యక్తి పాడుతున్న మోహనరాగంతో కీర్తన, "ననూ పాలింపా నడిచి వచ్చితివో నా ప్రాణనాథా" ఆమెని వెన్నంటి అనుసరించింది. ఇంక ఆ పూట లక్ష్మి ఖంగారు చూడాలి.

కాఫీ ఫిల్టర్‌లో రెండోసారి నీళ్ళబదులు పాలు పొయ్యబోయింది. పిల్లలకి పాలలో పంచదార వేయడం మర్చిపోయింది. కూరలు తరుగుతూ, వేలు కోసుకున్నంత పనిచేసింది. అత్తగారు మడికని పెట్టుకున్న చీర, అన్యమనస్కంగా తాకబోయి, మళ్ళీ ఆవిడ చూసేలోపల దూరంగా జరిగింది. మోహన్ గమనిస్తూనే వున్నాడు భార్య అవస్థ. అతని పెదవులు నవ్వు దాచుకోలేకపోతున్నాయి.

భోంచేసి, షర్ట్ వేసుకుని, ఆఫీసుకి బైల్దేరబోతుంటే ఆదరాబాదరా మోహన్‌కి వక్కపలుకందివ్వడానికొచ్చింది లక్ష్మి. వక్క నోట్లో వేసుకుని భార్య బుగ్గమీద చిటికేస్తూ అన్నాడతను. "నీ సంగీతం ధ్యాసలో, యీ దీనుడ్ని మాత్రం ఓ కంటకనిపెట్టడం మానకు."

చురుగ్గా చూసింది లక్ష్మి, దూరంగా జరుగుతూ.

"ఆఁ....ఆఁ....ఆగాగు....కోపం రానీకు.... బంగారుతల్లివిగా...." దగ్గరగా వచ్చి లక్ష్మిని చుట్టెయ్యబోయిన మోహన్, పెద్దమ్మాయి రమనల్లంత దూరంలో చూసి, చటుక్కున వెనక్కి తిరిగిపోయాడు, పనినెపంతో. నవ్వుకుంటూ యివతలకొచ్చేసింది లక్ష్మి. పెళ్ళయి పదిహేనేళ్ళు కావస్తోంది తనకి. ముగ్గురు పిల్లలకి తల్లి అయింది. అప్పటికీ యిప్పటికీ మోహన్ తీరులో మార్పు లేదు. అదే అనురాగం. అదే కొంటెతనం. 'మనం పెద్దవాళ్ళమవుతున్నాం.' అంటే, 'అలాగా.... నాకు తెలీదే!' అన్నట్టు చూస్తాడు మోహన్ అమ్మమ్మ అన్నట్టు అతన్ని పొందడానికి తను క్రిందటి జన్మలో పూలతో పూజలు చేసుకోలేదు గదా? భోగభాగ్యాలు లేకపోవచ్చు. కాని అతను తనని మన్నించేవిధం ముందు ఏ సంపదలు సాటి వస్తాయి?

పిల్లలు స్కూళ్ళకెళ్ళేదాకా వూపిరిసలపని పని లక్ష్మికి.

చిన్నమ్మాయి గునుస్తూ, గునుస్తూ స్కూలు కెళ్ళాక, 'అమ్మయ్య' అనుకోబోతున్న లక్ష్మికి సీతమ్మ కేక విన్పించింది.

"ఇదిగో....చూడమ్మా....రాధగారు ఫ్రాకులూ, జాకెట్లూ కుట్టమని బట్టలు పంపారు." ఆ చుట్టు ప్రక్కల అందరికీ లక్ష్మి మీద గురి, ఏది కుట్టినా, శ్రద్ధగా, చక్కగా అమిరేలా కుడుతుందని. లక్ష్మి చిన్నతనంలో, సరదాగా, హాబీగా, అవసరంగా నేర్చుకున్న కుట్టు పెళ్ళయ్యాక కాస్తోకూస్తో సంపాదించిపెడ్తోంది. మోహన్ మొదట వారించినా భార్య వుత్సాహాన్ని కాదనలేకపోయాడు. అన్నింటినీ మించి పెరిగే జీవనప్రమాణాలు వచ్చే డబ్బుని చేదు అనుకోలేకపోయాయి.

అత్తగారూ, తనూ భోజనాలు చేశాక, బట్టలు ముందు వేసుకుని కూర్చుంది లక్ష్మి. సీతమ్మ వసారాలో నవారుమంచం వాల్చుకుని పడుకుంది.

ప్రొద్దున్నుంచీ మనసులో సుడులు తిరుగుతున్న

కీర్తనని అప్రయత్నంగా వుచ్చరించాయి లక్ష్మి పెదవులు.

'ననూ పాలింపా నడిచివచ్చితివా నా ప్రాణ నాథా!'

ఎంత అపురూపమైన రాగం! ఎంత కమనీయ భావం!

త్యాగరాజు కీర్తనలు పాడాలంటే పూర్వజన్మ సుకృతం కావాలేమో! తనకా సుకృతం ఏదీ?

ఆ మాష్టారుగారెంత ధన్యజీవి! ఎంత అదృష్టం చేసుకున్నారు! ఎంత గొప్ప వరాన్ని చేజిక్కించుకున్నారు! భగవంతుడి కృపేనా అది? ఆ కృప భగవంతుడికి తనమీదెందుచేతనో కలగలేదు మరి...

లక్ష్మి కళ్ళు చెమ్మగిల్లాయి. తన చిన్నతనం గుర్తుకొచ్చింది.

ఆ రోజుల్లో నిజంగా ఎంత తాపత్రయపడింది. తను సంగీతం నేర్చుకోవాలని! నాలుగేళ్ళంటాయేమో మహా అయితే అప్పట్నుంచే ఏ పాట విన్నా అది పాడెయ్యాలని ఆరాటం....తల్లి తెల్లవారు ఝామున లేచి సన్నగా పాడుకునే గోపికా గీతాలూ తరంగాలూ వింటుంటే, తనలో ఆనంద కెరటాలువ్వెత్తున ఎగిసిపడేవి. కాస్త పెద్దయ్యాక తనూ తల్లితో గొంతుకలిపి పాడేది. అమ్మ కళ్ళలో వెలుగులు తనెలా మరిచిపోగలదు? తను పాడ్తుంటే, అమ్మ అనేకసార్లు తనని గుండెల కదుముకుని, 'నాకు శక్తేవుంటే నా చిట్టితల్లికి సంగీతం నేర్పించేదాన్ని' అనేది ఆర్తిగా కన్నీళ్ళతో.

తన కంఠం చాలా మధురంగా వుందనే వారు విన్నవాళ్ళంతా. అదీగాక పాటలో భావానికి అధిక ప్రాధాన్యతనిచ్చి అనుభూతి చెందుతూ పాడేది తను. చాలామందికి అది నచ్చేది.

'సంగీతం నేర్పించమ్మా అమ్మాయికి. పూవుకి తావి అబ్బినట్టవుతుంది' అని ప్రతివాళ్లూ సలహా యిచ్చేవాళ్ళే.

విని విని తను తల్లిని అడగనే అడిగింది. 'అమ్మా! నాకెందుకు సంగీతం నేర్పించవ్?' అప్పుడు తల్లి చూసిన చూపు తను జన్మలో మరిచిపోగలదా?

'నేర్పించాలనే వుందమ్మా....కాని చదువూ, సంగీతం రెంటికీ అయ్యేఖర్చు నిభాయించ లేను లక్ష్మీ....' బాధగా అంది అమ్మ.

నిజమే! ఆ రోజుల్లో పదిరూపాయలిచ్చి తనకి సంగీతం చెప్పించడం అమ్మకి భరించలేని ఖర్చే. తండ్రి అతి సామాన్య గుమస్తా. తన తర్వాత ముగ్గురు పిల్లలు. పైసపైసకీ లెక్క చూసుకునే ముక్తసరి ఆదాయంతో అమ్మ సంసారమే నడుపుతుందా, తన కోర్కెనే తీరుస్తుందా? మూగగా తన కోర్కెను వాయిదా వేసుకుంది. కాని ఆ తపన తీరేదేనా? వయసు పెరిగేకొద్దీ సంగీతం పట్ల తన అభిలాషా, అభిరుచీ పెరుగుతూనే వచ్చాయి. ఏ పాట విన్నా నేర్చుకోవాలన్న తహ తహ....ఏ రాగమైనా యిట్టే పట్టుకొగలిగేది. కాని ఏదో వెల్తి తనలో తనకి తెలీకుండానే పెరగడం మొదలెట్టింది. తన పాట యింకా గంభీరంగా రావాలంటే సంగీత సాధన అవసరమే సుమా అన్న భావన ముల్లులా అంతరంగాన్ని గుచ్చుతూనే వుంది. తనలో ఆ భావన మరింత నెలకొనెలా చేసింది, కమల అనే అమ్మాయితో తన పరిచయం. వాళ్ళింట్లో అంతా సంగీత ప్రియులు. కమల తండ్రి చక్కగా మఠం వేసుకుని, సునాయాసంగా రెండు గంటలపాటు కూర్చుని త్యాగరాజకీర్తనలు, దీక్షితార్, శ్యామాశాస్త్రి, స్వాతి తిరునాళ్, మైసూరు వాసుదేవాచారి మొదలైన వారి కృతులూ పాడేవారు. కమల అన్నయ్యకి హిందూస్తానీ సంగీతంలో ప్రవేశం వుంది తంబూరా, సితార్, తబలా, మృదంగం... వివిధవాయిద్యాలతో వాళ్ళిల్లు ఓ సంగీత ప్రపంచంలా వుండేది. దానికితోడు ఎప్పుడెళ్ళినా, రికార్డ్ ప్లేయర్లో నుండి బాలమురళీ కృష్ణదో, డి. కె. పట్టమ్మాళ్‌దో, ఎం. ఎస్. సుబ్బలక్ష్మిదో, అరియకుడి రామానుజయ్యగారిదో స్వరం విన్పిస్తూ వుండేది. ఆ గాయకులు పాడే పాటకనుగుణంగా వాళ్ళింట్లో ఏమూల నుండో ఎవరో ఒకరు అంత బాగానూ పాడేవారు. నలుగురు కలిస్తే ఎప్పుడూ రాగాల గురించో, వాగ్గేయకారుల గురించో, వారి రచనల గురించో చర్చలు. తను శ్రోతగా మిగిలేది అందరి మధ్యా కాని తన అభిలాషా, తపనా కొత్త మలుపులు సంతరించుకుంది వాళ్ళింట్లోనే. అంత దాకా తన కంఠం అభివృద్ధి చెందడానికి మాత్రమే సంగీతసాధన అనుకునేది. కాని వాళ్ళ పరిచయం వల్ల సంగీత ప్రపంచంలో నూతన కవాటాలు తెరుచుకున్నాయి. అనేక రాగాలూ, ఆ రాగాల్లో పొందుపరచబడిన వివిధ వాగ్గేయకారుల కీర్తనలూ, ఒక్కో కీర్తనలో నిండి నిబిడీకృతమైన భక్తి భావం.... సాహిత్య పరిపుష్టి.... తనని పులకింపజేసేవి నిలువెల్లా. అవి తను నేర్చుకునేదెలా? శృతి యుక్తంగా, తాళబద్ధంగా పాడి ఆ కీర్తనల్లో భావాన్ని తానాస్వాదించగలదా? అహర్నిశలూ యిదే ఆలోచన తనకి.

తనలో ఆరాటాన్నీ, కుతూహలాన్నీ, శ్రద్ధనీ గుర్తించే గురువు లభిస్తాడా? డబ్బివ్వలేని తన అశక్తతని గమనించి, తనలోని కళని ప్రోత్సహించే వ్యక్తి లభిస్తాడా?

కమలకి సంగీతం నేర్పించడానికి వాళ్ళ నాన్న ఓ మాష్టరుగారిని మాట్లాడారు. ఆయనికిచ్చే జీతం విని తన గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. నెలకి అరవై. తమ యింటి అద్దె అంత. కమలకి శాస్త్రీయ సంగీతం మీద పెద్ద ఉత్సాహం లేదు. మొక్కుబడిగా నేర్చుకునేది, వాళ్ళ నాన్నకోసమే అన్నట్టు. సంగీత పాఠాలు ఎగ్గొట్టడానికేమే

[లోకజ్ఞానం - సమాధానాలు]

1. మొట్టమొదటి మధ్యంతర ఎన్నికలు ఐదవ సార్వత్రిక ఎన్నికల పేరిట ఫిబ్రవరి 1971 లో గడువు సమయానికి ఒక సంవత్సరం ముందుగానే జరిగాయి.
2. రిచర్డ్ నిక్సన్. ఫిబ్రవరి 1972 లో.
3. డా॥ ఎస్. జెడ్. ఖాసిమ్. ఇరవైమంది శాస్త్రజ్ఞుల బృందంతో 'పోలార్ సర్కిల్' నౌకలో ఈయన అంటార్కిటికా హిమ ఖండంలో కాలు మోపి అక్కడో పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పారు.
4. భైరవదత్ పాండే.
5. వి. కె. అహూజా.
6. వెనుకవైపుకి.
7. హవాయ్ (యు. ఎస్. ఏ) దీవులలో 4,200 మీటర్ల ఎత్తున ఒక అణగారిన అగ్నిపర్వతం పైన కట్టిన 'అబ్సర్వేటరీ'లో వుంది. ఈ టెలిస్కోప్ లెన్స్ చుట్టు కొలత 3.6 మీటర్లు.
8. పాకిస్థాన్‌లో స్థిరపడిన నటి, గాయని నూర్జహాన్.
9. మీరాబెన్.
10. ఆగాషాహి. గత నెలలో ఆరోగ్యకారణాల వల్ల ఈయన తన పదవికి రాజీనామా ఇచ్చారు.

వుపాయాలు పన్నాలో అన్నీ పన్నేది. 'నిర్దయగాశపోతే, డబ్బున్నవాళ్ళకి అశ్రద్ధ, డబ్బులేనివాళ్ళకి శ్రద్ధ ఎందుకు పెట్టాలి దేవుడు?' అనుకునేది తను, నిస్పృహగా నవ్వుకుని.

సంగీతంపట్ల తన అభిలాష గమనించి అడగనే అడిగారా మాష్టరు.

"నువ్వూ నేర్చుకోరాదామ్మా?"

తల దించుకుని చెప్పింది తను. "మేమంత జీతం యిచ్చుకోలేమండీ!"

"పోనీ ముప్పై యివ్వమ్మా...." ఆదరంగానే అన్నారాయన.

ఏడుపొచ్చినంత పనయింది తనకి. తనకోసం క్రిందిమెట్టుకి దిగి వచ్చారాయన. ఆ క్రింది మెట్టుని కూడా అందుకోలేని అభాగ్యురాలు తను.

తన వేపు జాలిగా చూశారాయన. "ఈ వృత్తే నా జీవనాధారం....అందుకేనమ్మా!" అన్నారు నెమ్మదిగా. "పోనీ సంగీతకళాశాలలో చేరరాదూ? అక్కడైతే జీతాలవి అధికంగా వుండవని విన్నాను."

కళాశాల గురించి వినడం, దానిమీద ఆశలు వదులుకోవడం జరిగాయప్పటికే. అది తమ యింటికి చాలా దూరం. రెండు బస్సులు మారి వెళ్ళాలి. అమ్మ లెక్కలు వేసి చూసింది. జీతం తక్కువే గాని, రానూపోనూ పాతికపైనే తేలింది దాదాపు. అంత కష్టపడి వెళ్ళినా శ్రమే మిగులుతుంది తప్ప, నేర్చేది తక్కువ. చదువుకీ, యింటి పనికీ, సంగీతానికి లంగరుండదు. అచ్చగా, చదువు మానేసి సంగీతం నేర్చుకునే పరిస్థితి కాదు. అమ్మకీ, నాన్నకీ మొదట్నుండీ ఆడపిల్లయినా, మొగపిల్లవాడైనా బాగా చదివి, తమ కాళ్ళమీద తాము నిలబడాలన్న వుద్దేశ్యం.

ఇంటర్లో వుండగా, మోహన్ సంబంధం వచ్చింది. పైకి చదివించాలని వున్నా, తమ పరిస్థితుల కటువంటి సంబంధం మళ్ళీ మళ్ళీ రాదనిపించి, పెళ్ళి చేసి, తనని సాగనంపారు తలిదండ్రులు.

నిండు సంసారంలో మునిగినా, తనలో వుండుండి ఆ సంగీత తృష్ణ తలెత్తుతూనే వుంది. తనని తనే వూరడించుకుంటుంది లక్ష్మి. వెంటనే, 'అందరికీ అన్నీ సమకూరవు గదా! సహృదయుడైన భర్త, ముత్యాల్లా ముగ్గురు పిల్లలు, ఒడిదుడుకుల్లేని సంసారం! లేనిదాన్ని గురించి బాధపడి ప్రయోజనం లేదు. అయినా పాటంటూ పాడేందుకు దేవుడు మంచి కంఠమైనా ఇచ్చాడు. ఆ అదృష్టం లేనివాళ్ళెంతమంది లేరు?' అనుకుంటూ ఆ వూరడింపు మళ్ళీ తాత్కాలికమే అని తెలుసు. మంచి కృతి వింటే, గుండెలో సన్నటి బాధ. తను సంగీతం నేర్చుకోలేకపోయానే అని.

లక్ష్మికి ప్రస్తుతం ఒకటే సమాధానం. పెద్దది రమ చక్కగా పాడగలదు. దాన్ని చూస్తుంటే తన చిన్నప్పటి రోజులు గుర్తు వస్తాయి రేడియోలో వచ్చే సినిమాపాటలూ, భావగీతాలూ, వాటితోపాటే హమ్ చేస్తూంటుంది.

తన తీరని కోర్కె రమ ద్వారా తీరుతుందేమో!

అమ్మ అంటూండేది, 'ఒక్కోసారి తీరవు అనుకునే కోరికలు పిల్లల రూపేణా తీర్తాయి' అని అమ్మకి పాటమీద ఆసక్తి చాలా వుంది కాని అందుకు అనువైన కంఠం యివ్వలేదుట దేవుడు, అమ్మ చిన్నతనంలో వాళ్ళక్కయ్య సంగీతం నేర్చుకుంటుంటే విని, తనూ సంగీతం నేర్చుకుంటానంటే, అంతా ఎగతాళిగా నవ్వి 'సంగీతం నీ గొంతులో పలకదు' అనేవారట. అమ్మకి



ULKA-RP-1-82 TEL

రోషంగా, అభిమానంగా, దుఃఖంగా అన్పించేదట. కాని తన ఆసక్తి మాత్రం చచ్చిపోలేదు. వాళ్ళక్కయ్య నేర్చుకుంటుంటే, ఎంతో శ్రద్ధగా వినేది, అల్లంత దూరంలో కూర్చుని. అమ్మ పాడిన కృతులూ, గీతాలూ అలా వినికిడివల్ల నేర్చుకున్నవే, అవి శాస్త్రబద్ధం గాకపోవచ్చు. కాని భావసుందరమైనవి. అమ్మ తనకి తెలీకుండానే తన రక్తంలో ప్రవహిస్తున్న ఆ తృష్ణని తనలోనూ ప్రవేశపెట్టిందేమో! లేకపోతే ఆ కృతులూ అవీ నేర్చుకోవాలనే ఆసక్తి ఎలా వస్తుంది? కర్ణాటక సంగీతనిధిలో కనీసం లక్షోవంతైనా తన కరతలామలకంగావాలని యీ తపన దేనికి? 'భావాంబర వీధి విస్మృతవిహారిణి' శారదాంబ చరణసన్నిధిని, ఓ చిన్న గడ్డిపరకగానైనా చేరాలని ఎందుకీ అహమహమిక తనకి?

రమని తను అన్నివిధాలా ప్రోత్సాహిస్తుంది; రమ తనలా సంగీతం కోసం తపించ కూడదు. వీలైతే మరిన్ని జాకెట్లూ, మరిన్ని ఫ్రాకులూ కుట్టి డబ్బులేమివల్లే, తనలో కళ అణగారిపోయిన పరిస్థితి రమకి కలుగనివ్వదు తను.

ఆలోచనలనుండి తేరుకున్న లక్ష్మి, తన పని యింకా ఆరంభంలోనేవుందని గమనించి, గబగబా కత్తిరింపులు మొదలెట్టింది.

*

"చూడు లక్ష్మీ! ఎవరొచ్చారో...." మోహన్ పిలుపుకి, చీరకి తడి తుడుచుకుంటూ, ముందువేపు గదిలోకొచ్చింది లక్ష్మి. కొత్త వ్యక్తిని చూడగానే అప్రయత్నంగా చెరగు లాక్కుని భుజాలు కప్పుకుంది.

"కూర్చోండి మాష్టారూ! అతిశయోక్తి కాదుగాని...మీ రాకతో మా యిల్లు నిజంగా పావనమే అయింది. లక్ష్మీ! రోజూ తెల్లవార్తూనే తన సంగీతంతో నీకు వీనులవిందు చేస్తోన్న మాష్టరుగారు వీరు..."

లక్ష్మి మొదటిసారిగా చూస్తున్న వ్యక్తిలా చూసిందాయనవేపు. పాట వినడమేగాని, ప్రత్యేకంగా మనిషిని చూసే అవకాశం కలగలేదు. తనకి ఆయన ఆ యింటికి వచ్చి వారం పది రోజులు పైగానే అవుతున్నా.

తెల్లని జుట్టూ, గడ్డం, ఆయన బట్టలతో పోటీపడ్తున్నాయి. బంగారు ఫ్రేము కళ్ళజోడు. మెడలో రుద్రాక్షమాల. రెండు కనుబొమల మధ్యా చిన్న గంధపు బొట్టు. వయసు ఏభై, అరవై మధ్య వుంటుంది. చూడగానే గౌరవించాలనే బుద్ధి పుట్టించేలా వున్నాడాయన.

"నమస్కారమండీ!" అంది లక్ష్మి చేతులు జోడిస్తూ, చిరునవ్వుతో.

"చిరంజీవ! సౌభాగ్యవతివై వర్ధిల్లమ్మా!" రెండు చేతులూ యెత్తి దీవించాడాయన. "సంగీతమంటే మీకెంతో అభిమానమని అబ్బాయి చెప్పాడమ్మా .... ఇది ఒకవిధంగా నాకూ ప్రోత్సాహకరమైన విషయమే."

"లక్ష్మీ! చిక్కటి చక్కటి కాఫీ రెండు గ్లాసులు పట్టుకురా మాష్టారుగారిని పాపం దారిలోనే అటకాయించి యిటు లాక్కొచ్చాను." అన్నాడు మోహన్ లక్ష్మి వెళ్ళిపోయింది లోపలికి, అతనామాట అన్నదే తడవుగా.

"అయితే మాష్టరుగారూ....ఆ యింటి అసలు ఓనర్ మీరన్నమాట. రిటైరయ్యారు గనక కదిలే ప్రసక్తిలేదన్న మాటేగా...."

"అంతే బాబూ! ఇన్నాళ్ళూ యీ చోటూ, ఆ చోటూ అనక గవర్నమెంటు ఎటు తిప్పితే అటు తిరిగి, తిరిగి, ఆఖరిమజిలీగా యిక్కడొచ్చి పడ్డాను. ఏదో నాకూ, దానికీ కాస్తంత వుడకేసుకుని తింటూ, బ్రతికినంతకాలం సంగీత సాధన చేసుకుంటూ గడిపేయాలని వుంది."

"మాష్టరుగారూ! మీకు పిల్లలు...."అర్థోక్తిలో ఆగిపోయాడు. మోహన్.

"ఉన్నారు బాబూ! ఇద్దరు మగపిల్లలు....ఓ ఆడపిల్ల. ఎవరి సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు. వాళ్ళ దగ్గరుండకుండా మేమీ పెద్ద వయసులో ఒంటరిగా ఎందుకవస్థ పడాలన్నదేగా బాబూ నీ సందేహం? నిజమే! ఆ సందేహమెవరికైనా వస్తుంది. నేనా....సంగీతమే ప్రాణంగా బ్రతికినవాడిని నలుగురు పిల్లలకి పాఠాలు చెప్పుకోవాలన్నా, నేను సాధన చేసుకోవాలన్నా వాళ్ళ యిళ్ళలో సాధ్యంగాదు, అదీగాక యిది మా పెద్దలు కట్టించిన యిల్లు ఉద్యోగరీత్యా వుండ వీలవలేదిన్నాళ్ళూ కనీసం యిప్పుడైనా స్థిమితంగా వుందామని అసలింకో కారణం వుంది బాబూ. మా ఆవిడకి చూపు క్రమంగా మందగించి, ప్రస్తుతం గుడ్డిదైపోయింది. కొంత తన నిర్లక్ష్యం, కొంత నా మెతకదనం. ఏదైతేనేం బాబూ చేతకీ, చూపుకీ పని లేకపోవడంతో, ఆవిడ నోరూ, చెవులూ ఆ డ్యూటీ తీసుకున్నాయి. ఏ చిన్న శబ్దం అయినా ఏమిటదీ ఎందుకయిందీ....యిలా ప్రశ్న మీద ప్రశ్నేసి తెగ విసిగించేస్తుంది. వాళ్ళూ చిన్నవాళ్ళాయె. ఎంతకని భరిస్తారు? కాస్తంత చిరాగ్గా మాట్లాడితే దీనికి ఏడుపు, యిక యిది పనిగాదని, దాన్ని వెంటేసుకుని యీ యింటికొచ్చేశాను...."

మాష్టరుగారు చెప్పే ధోరణికి నవ్వు వచ్చినా, లోపల కాఫీలు కలుపుతున్న లక్ష్మికి, ఆయన మీద జాలేసింది. పెద్ద వయసులో గుడ్డి భార్య కోసం చెయ్యి కాల్చుకుంటున్నాడని. ఇవతల కొచ్చి కాఫీలందించి, ఎడంగా నిల్చుంది లక్ష్మి.

"మాష్టరుగారూ! మా లక్ష్మికి సంగీతమంటే ప్రాణం అండీ! మీ కభ్యంతరం లేకపోతే, మీ శిష్యురాలిగా చేరుతుంది...." అనేసి 'ఏవంటావ్?' అన్నట్టు భార్యవేపు చూశాడు మోహన్. లక్ష్మి ముఖంలో ఆ క్షణం చెలరేగిన భావాలెన్నో!

అన్నీ, ఓ చిరుదరహాసంతో అణిచేసుకుని అన్నదామె.

"నేనా? యీ వయసులోనా? మీరు హాస్యానికంటున్నారా? ఇంకా మన రమ విషయం అదిగినా ఆందంచందం..."

"ఏం మాష్టారూ! మీరు చెప్పండి. విద్యకి వయసుతో పనేమిటండీ? తనకి చాలా ఆసక్తి వుంది. నేర్పే గురువు ఎదురుగుండానే వున్నప్పుడింక సందేహాలెందుకు?"

"అవునమ్మా! నిజమే....చిన్నవాడైనా మీ ఆయన బహు వుత్తమమైన మాటన్నాడు. ఏ విద్య అయినా రావడానికి దానిపట్ల తగిన శ్రద్ధా, కుతూహలం, కృషీ వుంటే వయసు అడ్డు పడ్తుందిటమ్మా?"

లక్ష్మి ముఖంలో అనంతకోటి కాంతిపుంజాలు. ఆమె గుండెల్లో ఆ క్షణం ఎగదన్నుకొచ్చిన సంతోషం ఏ కవి వర్ణనకూ అందదు. ఏ చిత్రకారుడి లేఖనంలోనూ యిమడదు. గబుక్కున ముందుకెళ్ళి ఆయన పాదాలకు నమస్కారం చేసేసింది. ఆ నమస్కారం చేయడంలో గల భక్తి పురస్సరమైన వినమ్రభావం మోహన్ దృష్టిని దాటిపోలేదు.

"రేపు మంచిరోజమ్మా! సంగీత పాఠానికి శ్రీకారం చూడదాము. ఇంకో యిద్దరు శిష్యురాళ్ళున్నారు. వాళ్ళనీ రేపే రమ్మన్నాను."

"అలాగే కానివ్వండి మాష్టారూ!" లక్ష్మి తరఫున మోహనే అందుకున్నాడు "ఇంతకీ మీ

గురుదక్షిణ....'' సందేహంగా ఆగిపోయాడు.

ఆయన ముఖంలో చిరునవ్వు కదలాడింది.

"తను నేర్పిన విద్యను అక్షరాలా అభ్యసించగల శిష్యులకన్నా గురుదక్షిణ వేరే ఏం కావాలి బాబూ గురువుకి నిజం చెప్పాలంటే? అయినా మీరడిగారు కాబట్టి....గురుదక్షిణ అనేది యివ్వడం అనాదిగా వస్తోన్న ఆచారం గాబట్టి....పది రూపాయలు ఫీజు తీసుకుంటాను. నాకొచ్చే పెన్షనుకి, యీ పాఠాలు చెప్పుకుంటే వచ్చే డబ్బు కలుపుకుంటే ఒకళ్ళని చెయ్యి జాపి అడగఖ్ఖర్లేదు...'' అంటూ ఆగి లక్ష్మి వేపు చూస్తూ అన్నారాయన. "సంగీతాన్ని నేను వృత్తిగా స్వీకరించలేదమ్మా! అది ఓ పవిత్రమైన విద్య. అపురూపమైన కళ. నేను నేర్చినదానికి సార్థకత కలిగేది, మరో పదిమంది దాన్ని గ్రాహ్యం చేసుకుని సంతోషించినప్పుడే.''

లక్ష్మి కళ్ళలో సన్నటి నీటి తెర! సంతోషానికి బాహ్య చిహ్నం.

ఎంత ఆలస్యంగా తారసపడ్డారు తనకి ఒక మంచి గురువు!

ఫర్వాలేదు....ఎంత ఆలస్యమైనా యింత అపురూప అవకాశం తనకి దొరకిందిగదా! ఈ అవకాశాన్ని తను సద్వినియోగపరుచుకోవాలి.

ఇది కల్పించింది తన భర్తగాదూ?

భార్యలో కళాతృష్ణ నర్థం చేసుకుని ప్రోత్సహించే భర్త లభించడం తన పూర్వజన్మ సుకృతం.

ఆ ఆనందంలో ఆమె, అప్పుడే గుడికెళ్ళి వచ్చిన అత్తగారినిగానీ, కాస్త దూరంగా నిల్చుని తననీ. మాష్టరుగారినీ మార్చి మార్చి చూస్తున్న పిల్లల్నిగానీ గమనించలేదు. రాత్రి భోజనాలప్పుడు అంది, సీతమ్మ మోహన్‌తో.

"అయితే పిల్లలన్నది నిజమేనన్నమాట! ఆయనచేత లక్ష్మికి సంగీతం చెప్పిస్తావా?''

"అవునమ్మా! తనకి నేర్చుకోవాలన్న వుత్సాహమెంతవుందో, ఆయనకీ నేర్పే ఆసక్తి అంతగానూ వుంది. పైగా ఆయన ఫీజు మనకి అందుబాటులో వుంది. దూరమూ కాదు. అన్నీ ఆలోచించి నేనే ఆయనతో మాట్లాడాను.''

"ఇంకా నేను మన రమకోసం అనుకున్నాను. దాని మాటేమిటి?''

"దానికీ నేర్పిస్తాను....దానికి ఆసక్తి కలిగి నేర్చుకుంటానంటే నేను కాదంటానా అమ్మా?''

రమ మౌనంగా తల దించుకుని కంచంలో అన్నం కెలుకుతోంది.

అత్తగారిలో తను ఆశించినంత సంతోషం కనపడలేదు లక్ష్మికి.

కనపడనందుకు నిరాశ పడదల్చుకోలేదు లక్ష్మి.

*

లక్ష్మి తెచ్చిన కొత్త నోట్ పుస్తకంలో, గురుధ్యానమ్, విఘ్నేశ్వరస్తుతి, సరస్వతీ స్తోత్రం రాసి, ముందుగా సరళీస్వరాలు రాశారు మాష్టరుగారు. పుస్తకం లక్ష్మి చేతికిచ్చి, తంబూరా శృతి చేశారు. ఆ నాదం వింటూనే తన్మయత్వం చెందింది లక్ష్మి. ఆయన వేళ్ళు మృదువుగా తీగెలను మీటుతుంటే ముగ్ధురాల్లా చూస్తూ కూర్చుంది.

"ఏదీ అనమ్మా....స. రి. గ. మ. ప. ద. ని. స స. ని. ద. ప. మ. గ. రి. స.''

లక్ష్మి కంఠం మధురంగా ఆయన్ననుకరించింది.

"సంగీతాని కనువైన గాత్రం అమ్మా నీది.... నీకిన్నేళ్ళూ సంగీతం నేర్చుకునే అవకాశం కలగనందుకు ఆశ్చర్యంగానూ, యిన్నేళ్ళయినా నీ ఆసక్తి చెదిరిపోనందుకు సంతోషంగానూ వుంది. అరె! అదేమిటమ్మా? ఆ కంట తడి దేనికీ?''

లక్ష్మి కళ్ళు తుడుచుకుని చిన్నగా నవ్వింది.

"ఏం లేదు మాష్టారూ....మీరే నా చిన్నతనంలో తారసపడుంటే....మా అమ్మ బ్రతికి వుంటే....కాలం వెనక్కి వెళ్ళదు...పోయిన మా అమ్మ తిరిగీ రాదు...'' అలా సంగీతానికి తొలి సోపానమైన సరళీస్వరాలతో మొదలైన లక్ష్మి సాధన అవిరళంగా, అవిరామంగా సాగేదే!

సాగకపోతే మాత్రం అది జీవితం!

*

తల్చుకుంటే విషాదంగా అన్పిస్తోంది లక్ష్మికి.

తన కళ్ళ ముందు ఎన్నెన్ని సుందరవర్ణ భావ తోరణాలు!

ఏవీ అవన్నీ?

లక్ష్మి చేతులు నిరాసక్తంగా మిషనుముందు పని చేస్తున్నాయి.

'సాధన లేనిదే సంగీతం రాణించదమ్మా!' మాష్టారుగారి మాటలు గుర్తు వచ్చాయి. 'రోజుకో గంట, లేదా అరగంటైనా కూర్చుని బాగా సాధన చేయాలి. శృతి, లయా క్రమపద్ధతిలో వుండేలా చూసుకుంటూ, స్వరం అభ్యాసం చేయాలి....'

గంటకాదు....అరగంట కూడా తను వెచ్చించడం గగనమైపోతోంది!

'పుస్తకం చూసి పాడే అలవాటు తప్పనను గాని, మంచి పద్ధతిగాదమ్మా! ప్రతిస్వరమూ, ప్రతి కీర్తనా నాలుక మీద నర్తించాలి గాయకుడికి. అప్పుడే సంగీత విద్యకి సార్థకత' అంటూ ఆయన పుస్తకం మూయించి పాడిస్తే తను వేసే స్వరాలలో ఎన్ని తప్పుల నడకలు!

ఎన్ని తాళపు తికమకలు!

ఎంత సిగ్గుగా అన్పించేది తనకి!

తెలుసు, కారణం సాధనలేమి తప్ప మరొకటి కాదని!

అరగంట కూడా దొరకడం లేదంటే ఆయన నమ్ముతారా? అతిశయోక్తి అని కొట్టిపారెయ్యరూ? అసలు సంగీతానికి కాలంతో పనేమిటి? అరగంట నిజంగా సరిపోతుందా, ఆ గానవారాశిలో ఓలలాడేందుకు? తనకి కచ్చితంగా తెలుసు, పాడడం మొదలెడితే అది అరగంటలో తేలే వ్యవహారం కాదని. సంగీతంలో లీనమైతే, తను యిహాన్నే మరిచిపోతుందని. కాని....కాని....యిల్లాలిగా తన బాధ్యతలు తనని కాలంతో పోటీ పడేలా చేస్తున్నాయి మరి!

చీకూ, చింతా బాధ్యతా లేని వయసులో తనకి నేర్చుకుందామన్నా వీలవలేదు.

ఇప్పుడు నేర్చుకునే అవకాశం వెతుక్కుంటూ వస్తే, బాధ్యతలు తనని పట్టి వెనక్కి లాగుతున్నాయి.

ఓ రోజు వుత్సాహంగా అయిదు గంటలకి లేచి, తంబురా తీగెలు మీటుతూ, కృతి ఏదో పాడబోయింది.

"ఇదిగో లక్ష్మి! నీ సాధనేదో నేనాఫీసుకెళ్ళాక మొదలెట్టు. నా బంగారం లాంటి నిద్ర చెడగొట్టకు'' గారాబంగానే అన్నా, మోహన్ కంఠంలో దృఢత్వం మరి తనని పాడనివ్వలేదు- నిజమే. తమ యిల్లు చిన్నది. ఏమూల, ఏచిన్న శబ్దమైనా యిల్లంతా విన్పిస్తుంది, తన ఆనందం కోసం యింకోళ్ళని వ్యథపెట్టడం బావుండదు. లక్ష్మి తనని తనే సమాధాన పర్చుకుంది.

లక్ష్మి మనోఫలకం మీద మరోదృశ్యం.

"లక్ష్మి, బాబిగాడికి సోషల్లో మార్కులు

[58వ పేజీ చూడండి]

[తృష్ణ : 45వ పేజీ నుంచి]

తక్కువ వచ్చాయే?'' అంటున్నాడు మోహన్. ఆ అనడంలో యిది నీ తప్పేసుమా అన్న ఫిర్యాదు స్పష్టంగా కన్పిస్తోంది.

"సంగీతం నేర్చుకోవద్దనను కాని పిల్లల సంగతి చూడు....''

పగలంతా తను యింటిపట్టునే వుంటుంది గనక పిల్లల ఆలనా పాలనా, చదువూ సంధ్యా తను గాకపోతే మరెవరు చూస్తారన్నది అతని ఉద్దేశ్యం.

"ఎలా చూస్తుందిరా నీ చాదస్తం? అటు సంగీతమే నేర్చుకుంటుందా? బిడ్డలపనే చూస్తుందా? పిల్లల పనే చూస్తుందా? వెయ్యిళ్ళ పూజారంటారు యిలాంటి వాళ్ళనే గాబోలు'' అంటూ అత్తగారి సన్నాయి నొక్కులు.

"రండి. రండి సుందరమ్మగారూ''! సీతమ్మ ఆహ్వానించింది పొరుగింటావిడ్ని.

ఉలిక్కిపడింది లక్ష్మి. బాబిన్‌లో దారం లేక పోవడంతో, కుట్టు పడనేలేదు. దారం యెక్కించి పని మొదలెట్టింది.

"భోజనాలయ్యాయా?'' అడిగింది సుందరమ్మ పరచిన చాపమీద తీరుబాటుగా కూర్చుంటూ.

"ఆఁ....అయినాయిప్పుడే....''

ఇంక ఆ ఖబుర్ల నంతం.

"ఎందాకా వచ్చిందేమిటి మీ కోడలి సంగీతం?'' సుందరమ్మ గొంతు తగ్గినా విన్పిస్తూనే వుంది లక్ష్మికి.

"ఏదో నేర్చుకుంటోంది. నేనడిగానా, పెట్టానా?''

"ఏమైనా మహ ఓపికమంతురాల్లెండి మీ కోడలు. యిటు ఇంటిపనీ, పిల్లలపనీ, అటు సంగీతం'' ఆవిడ మెప్పుదలలో హాస్యమెంతుందో. నిజమెంతుందో దేవుడికే తెలియాలి.

"ఏదో వాడు పూనుకున్నాడని నోర్మూసు కూరుకున్నానుగాని సుందరమ్మగారూ, బంగారము వంటి కోమటి సంగీతము చేత బేరసారము లుడిగెను అన్న సామెత అక్షరాలా నిజమవుతోం దండీ మా యింట్లో, ఏ వయసుకా ముచ్చట బావుంటుంది గాని, యిదెక్కడి విడ్డూరం. కూతుళ్ళు ఎదిగి వస్తున్నారు. పెద్దది రమ బాగానే పాడ్తుంది. దానికి నేర్పించమనండి. ఒప్పుకుంటాం. ఈ పాట ధ్యాసలో పడి కూర పోపు మాడ్చడమో, ఒకటికి రెండుసార్లు ఉప్పు వేయడమో చేస్తోంది. వాడేమో తెగ విసుక్కోవడం ఆడదానికి సంసారం తర్వాతేగదండీ ఏదైనానూ కూడూ గుడ్డా ఏర్పాటు చేసే మగాడికన్నా ఎక్కువేమిటండీ ఆ సంగీతం తనేం కచేరీలు చేయబోవడం లేదుగదా. ఒక శ్శిద్దరు యీ మధ్య జాకెట్లివ్వడం మానేశారు. బాగా కుట్టడం లేదని, ఎలా కుడ్తుంది? సంగీతంలో పడ్తే ఒళ్ళే తెలీదు. "చాలా మెల్లగా మాట్లాడుతున్నా ననుకుని చెప్తోంది సీతమ్మ. లక్ష్మి వినకూడదని.

ఏ మాటలు వింటే బాధ కలుగుతుందో, అవే చెవిలో దూరడం సహజం.

లక్ష్మి మ్రాన్పడిపోయింది.

ఇదా అత్తగారికి తన సంగీతం పట్ల వున్న అభిప్రాయం? ఆవిడమాటల్లో ఎంత పదును. పెళ్ళయి సంసారం చేసుకుంటున్న స్త్రీ విద్యకనర్హు రాలనా ఆవిడ ఉద్దేశ్యం? ఈ విద్య లౌకికమైనది గాదే. భగవంతుడి ఆరాధన కుపయుక్తమైన సామవేదం యిది ఓ పరమార్థాన్నీ, ఓ పారలౌకిక చింతననీ, ఓ అఖండ, అనంత ఆత్మతత్త్వాన్నీ తెలిపే సంగీత సాధన ఆవిడ దృష్టిలో నిరుపయోగ మైనది. సంసార చక్రాన్ని సాగనివ్వకుండా కుంటుపరిచేది.

లక్ష్మి పెదవులమీద భావశూన్యమైన లాస్య మొకటి కదిలి మాయమైపోయింది. కళ ఓ త్రిడైమెన్షనల్ వస్తువనుకుంటే, ఆ త్రిడైమెన్షన్సూ, ప్రోత్సాహమూ అవకాశమూ, అనుకూల వాతావరణమూ. మొదటి రెండూ లభ్యమై మూడోది సానుకూల పడకపోవడం ఓ తీయని శాపం తనకి తీరని దాహం.

మాష్టరుగారు సాయంత్రం దేవుడిముందు దీపం వెలిగించి, సారమతి రాగంలో, త్యాగరాజ కృతి, మోక్షముగలదా భువిలో జీవన్ముక్తులు గాని వారలకు, అని ప్రారంభించారు.

'సాక్షాత్కార నీసద్భక్తి, సంగీత జ్ఞానవిహీను లకు' అన్న అను పల్లవి వింటూ, కళ్ళు వర్షిస్తుండగా, బాధ్యతల వలయంలోకి ప్రవేశించింది లక్ష్మి. ఇంక రాత్రి పడకొండుకే ఆ వలయం నుండి విముక్తి తనకి. పిల్లల చదువులూ, హోంవర్కులూ, వాళ్ళ తగవులూ పరిష్కారాలూ, వంటా, వడ్డనా అవంతగా, అనాదిగా సాగే నిత్య జీవన పోరాటం.

"ప్రాణావల సంయోగమువల్ల
ప్రణవనాద సప్తస్వరములు బరగా
వీణావాదన లోలుడై శివమనోవిధమెరుగరు
త్యాగరాజ వినుత.''

మాష్టరుగారు పాడ్తూనే వున్నారు.

*

ఆ రోజునుండి పిల్లలకి దసరా సెలవులు. మోహన్ తీరుబాటుగా పిల్లల్ని దగ్గర కూర్చో బెట్టుకుని ఖబుర్లు చెప్తున్నాడు. కాస్త దూరంలో మల్లెపూలు కుప్పగా పోసుకుని మాల కడ్తోంది లక్ష్మి. సీతమ్మ దేవాలయానికెళ్ళింది పొరుగింటావిడతో.

ఉన్నట్టుండి మోహన్ అడిగిన ప్రశ్న లక్ష్మి వులిక్కిపడేలా చేసింది.

"రమా! మాష్టరుగారి దగ్గర సంగీతం నేర్చుకుంటావా?''

రమ వేపు కుతూహలంగా చూసింది లక్ష్మి. అదే క్షణం, రమ కూడా తల్లి వేపు చూసి, ఎందుకో చిన్నగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావ్?'' మోహన్ అడిగాడు.

"చెప్తే అమ్మకి కోపం వస్తుందేమో...''

లక్ష్మి నిటారుగా అయిందప్రయత్నంగా.

"ఏం రాదులే చెప్పు'' అంది చిరునవ్వుతో.

"మాష్టరుగారి దగ్గర సంగీతం నేర్చుకోక పోతే ఏమవుతుంది?''

రమ ప్రశ్నకి అటు మోహనూ యిటు లక్ష్మి యిద్దరూ తబ్బిబ్బైపోయి, ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"పోనీ యింకెవరిదగ్గరైనా నేర్చుకుంటావా?'' కుతూహలంగా అడిగింది లక్ష్మి. ఆ ప్రశ్నలో ఆమెకి రమ మీద వున్న ఆశలన్నీ ప్రతిఫలించాయి.

"అసలు సంగీతమే నేర్చుకోకపోతే ఏమవుతుంది?'' నవ్వుతూ, నవ్వుతూ రమ బాంబ్‌షెల్‌లా వేసిన ప్రశ్న.

లక్ష్మి దిగ్భ్రాంతి చెందింది.

"అవును! నిజమే! ఏమవుతుంది? ఈ ప్రశ్న వేసుకోవాలని కూడా తనకెన్నడూ తట్టలేదే! అయితే...అయితే...తన యిన్నేళ్ళ తృష్ణకీ తపనకీ అర్థమేమిటి? చెక్కుచెదరని తన అన్వేషణకి ముగింపేమిటి?''

మోహన్‌కి లక్ష్మి కళ్ళలో కూలిపోతున్న ఆశలు కన్పించాయి. □